ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

అబిడ్స్: కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారంటీలను 100 రోజుల లోపు ప్రజలకు అమలు చేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ.. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన చేపట్టిందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన దీపాదాస్ మున్షికి గౌరీసతీష్ మంగళవారం స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. గతంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు చేయకపోవడంతో ప్రజలంతా సమస్యలతో ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజాపాలన ద్వారా అందరి దరఖాస్తులను స్వీకరించి ప్రజలకు వెంటనే ఆరు గ్యారంటీలను అధికారులు అందజేస్తారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మానయ్య షాబాద్ దర్శన్, భిక్షపతి తదితరులున్నారు.


రాష్ట్ర నూతన ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షికి స్వాగతం పలుకుతున్న గౌరీసతీష్

శ్రీరాముడి అక్షింతలు పవిత్రమైనవి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్


అక్షింతలు, కరపత్రం అందజేస్తున్న ఎస్‌బీఎస్ అధ్యక్షుడు మధిర సత్యనారాయణ


రాహుల్‌దాస్‌బాబాతో వినాయక సుజాత కుటుంబసభ్యులు

గోల్కొండ: అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ఎంతో పవిత్రమైనవని ప్రతి ఇంట్లో పూజగదిలో వీటిని ఉంచవలసిన అవసరం ఉందని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన శ్రీరాముడి అక్షింతల ప్రాధాన్యంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి అక్షింతలు తీసుకుని వెళ్లే వారు ఈ అక్షింతలు తాము తీర్థక్షేత్ర ట్రస్ట్ తరపున వచ్చాయని చెప్పాలన్నారు. అక్షింతల వెంట శ్రీరామమందిర చిత్రపటం, తీర్థక్షేత్ర కరపత్రంతో పాటు ఐదు గ్రాముల అక్షింతలు ఇవ్వాలన్నారు. ఈ అక్షింతలు మృగ ముద్రలో ఇవ్వాలన్నారు. ఈ అక్షింతలు స్వీకరించిన ఇంటి యజమాని ఈ అక్షింతలతో పాటు తమ ఇంటి బియ్యాన్ని వాటితో కలుపుకుని వృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈనెల 22న అయోధ్యలో శ్రీ బాల రాముల వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో ప్రతి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేవాలయానికి వెళ్లి ప్రార్థనలు చేసి ఇంట్లో కూడా భక్తిశ్రద్ధలతో అక్షింతలను నెత్తిన ధరించాలని, పిల్లలను దీవించాలన్నారు. మహిళలు తమ భర్త ఆశీస్సులు తీసుకోవాలన్నారు. అదే రోజు సాయంత్రం అయోధ్యలో పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం రాత్రిపూట తమ ఇంటి ముందు కనీసం ఐదు దీపాలు వెలిగించాలని ప్రతి ఇంటిని వీలైతే విద్యుత్ దీపాలతో అలంకరించేలా చూసుకోవాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు నామయాదగిరి తదితరులున్నారు.

గడపగడపకు రాముడి అక్షింతలు..

జియాగూడ: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను, శ్రీరామ మందిర పోస్టర్‌ను గడపగడపకు అందజేస్తున్నట్లు ఇమామ్‌పురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ ఇమామ్‌పురాలో శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, ఇమామ్‌పురా ప్రముఖ్ రాజేష్, పురుషోత్తం, సంఘం ప్రతినిధులు మహేందర్, సురేందర్‌కుమార్, వెంకటేష్, బాలప్రసాద్, శ్రీను, బీజేపీ నాయకురాలు కమలాబాయి తదితరులున్నారు.

ప్రతి ఇంట్లో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి..

లంగర్‌హౌస్: అయోధ్య రామాలయం ప్రారంభం రోజు జనవరి 22న ప్రతి ఇంట్లో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి ఘనంగా దీపావళి వేడుకలు నిర్వహించుకోవాలని సంగం పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా పిలుపునిచ్చారు. ఇబ్రహీంబాగ్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద గురుస్వామి వినాయక సుజాత 18వ మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేశవ గురుస్వామి ఆధ్వర్యంలో భారీ వేదికపై సర్వాంగసుందరంగా కొలువు దీరిన చిన్నారి మణికంఠునికి పంచామృతాభిషేకాలు, పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌దాస్‌బాబా మాట్లాడుతూ.. ఆడవారు కఠోరంగా అయ్యప్పదీక్ష చేసే అవకాశమే గొప్పైతే.. 18 ఏళ్లు వినాయక సుజాత దీక్ష చేయడం ఆమె అదృష్టమన్నారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ వేళ ఇంటింటికీ తిరిగి ఇస్తున్న అయోధ్యలో పూజిత అక్షింతలను తలపై వేసుకుని, పిల్లలకు కూడా వేసి దీవించాలన్నారు. గురుస్వాములు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్‌ను కలిసిన యూనియన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్ : వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాబర్ట్ బ్రూస్, జాలిగామ అశోక్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించే దిశగా కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. లావణ్య, రాజ్‌కుమార్, శ్రీకాంత్, గోపికృష్ణ, నర్సింహ, రాఘవేందర్ తదితరులున్నారు.

అయ్యప్ప భక్తులకు కేరళలో సౌకర్యాలు కల్పించాలి


గోషామహల్ బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు మనోహర్ గైక్వాడ్

అబిడ్స్ : కేరళలో అయ్యప్ప భక్తులు ఇబ్బందులపాలు కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో కేరళ ప్రభుత్వంతో సంప్రదించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్ డిమాండ్ చేశారు. మంగళ్‌హాట్ గుఫానగర్‌లో రవీంద్రగుప్తా స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. లక్షలాది మంది అయ్యప్ప భక్తులు కేరళలో అయ్యప్ప దర్శనం కోసం అవస్థలు పడుతున్నా.. అక్కడి కేరళ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ.. ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేరళ సీఎంతో సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు. కేరళ హైకోర్టు కేరళ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసినా.. ప్రభుత్వ తీరులో మార్పు రావడం లేదన్నారు. వెంటనే అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి..

అఫ్జల్‌గంజ్ : శబరిమలలో అయ్యప్పస్వాములు పడుతున్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ అయ్యప్ప ఐక్య వేదిక ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వేదిక ప్రతినిధులు సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి చిన్నపిల్లలు, మహిళలతో సహా లక్షలాది మంది అయ్యప్ప మాలలు వేసుకుని శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్తుంటారన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి వెళ్లిన భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి, కనీస వసతులు లేవని, నిలక్కల్ నుంచి పంబా వరకు రవాణావ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికార బృందాన్ని పంపించి స్వాములు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారన్నారు. ఐక్యవేదిక ప్రతినిధులు గురుస్వాములు నాయిని బుచ్చిరెడ్డి, బాలకృష్ణ, రాధాకృష్ణ, ప్రేమ్ గాంధీ, రాకేష్, ప్రభాకర్‌రెడ్డి, విజయభాస్కర్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


జీహెచ్‌ఎంసీ అధికారి మహ్మద్ హష్మికు దరఖాస్తు అందజేత


దారుసలాం ఎస్‌డీనగర్ వద్ద దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ మన్నే ప్రేమ్‌కుమార్

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని లంగర్ హౌజ్ కార్పొరేటర్ వజీఉజ్జమా అన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికోసం గోల్కొండ కుమార్‌వాడిలో ఏర్పాటు చేసిన మజ్లిస్ పార్టీ సేవా కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. సయ్యద్ సిద్దిఖ్, ఖాలేద్ అసద్, ఖలీల్, అఖిల్‌ఖాద్రీ తదితరులు 6వ తేదీ వరకు దరఖాస్తుదారులకు సాయం చేస్తారని ఆయన తెలిపారు.

దరఖాస్తుదారులకు సకల ఏర్పాట్లు...

అబిడ్స్: ప్రజాపాలనలో దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు చేశామని నాంపల్లి నాంపల్లి మండల తహశీల్దార్ మన్నే ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. దారుసలాం ఎస్‌.డీ.నగర్ ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చే దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా సహాయ కేంద్రం ద్వారా వారికి సహకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

యాకుత్‌పురా : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సూచించారు. మంగళవారం ఆయన యాకుత్‌పురా నియోజకవర్గంలోని రెయిన్‌బజార్, తలాబ్‌చంచలం డివిజన్ల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమం కేంద్రాలను ఆయన సందర్శించారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన స్థానికులతో ముచ్చటించి దరఖాస్తు పత్రాలను పరిశీలించారు. మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జ్ యాసర్ అరఫత్, కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, మహ్మద్ వసీవుద్దీన్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో 51,821 దరఖాస్తుల స్వీకరణ..

నాంపల్లి : నియోజకవర్గంలోని 28 కేంద్రాల్లో ఇప్పటి వరకు 51,821 దరఖాస్తులు స్వీకరించినట్లు నాంపల్లి నియోజకవర్గం ప్రత్యేక అధికారి శ్రీవాత్సవ, మెహిదీపట్నం సర్కిల్ -12 ఉప కమిషనర్ చంద్రశేఖర్, ఏఎంసీ నర్సింగ్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే 12,294 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

లంగర్‌హౌస్: ప్రజాపాలన ఆరు గ్యారంటీల కోసం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరి దరఖాస్తును అధికారులకు అందించడానికి తామంతా కేంద్రాల్లో ప్రజాసేవలో నిమగ్నమయ్యామని కార్వాన్ నియోజకవర్గం ఎంఐఎం మహిళా అధ్యక్షురాలు మత్స రేణుక అన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, గోల్కొండ తహసీల్దార్‌లు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి వారి సేవలో నాయకులు, కార్యకర్తలు నిమగ్నమవ్వాలని పిలుపునిచ్చారు. దీంతో వారి పిలుపు మేరకు వివిధ పార్టీల నాయకులు ఇంటింటికీ తిరుగుతూ.. కేంద్రాల వద్ద కూడా దరఖాస్తులు రాస్తూ.. వారి సందేహాలు తీరుస్తున్నారు. వాజీఉద్దీన్, మాతంగి రమేష్, శివశంకర్ పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

గన్‌ఫౌండ్రీ : వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే తమ లక్ష్యమని ఎస్‌ఎస్‌వి గ్రీన్ స్టోన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఎండీ. సీహెచ్ అర్జున్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎస్‌ఎస్‌వి సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగికి ప్రత్యేక శిక్షణ తరగతులు నేర్పించినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సంస్థ డైరెక్టర్ పవన్‌రెడ్డి, ఎం.రాధాకృష్ణ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కాళీమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొల్లు జగన్‌ను సత్కరించారు. దేవాదాయశాఖ అన్ని దేవాలయాలను సంరక్షించాలని కోరారు. దూపదీప నైవేద్యాల కోసం నిధులను సక్రమంగా విడుదల చేయాలన్నారు. సూర్యశుక్లా, మనోజ్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై విచారణ జరిపించాలి

గన్‌ఫౌండ్రీ : రాష్ట్రంలోని కాళేశ్వరం, ఇతర నీటిపారుదల ప్రాజెక్టులలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరపాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ కోరారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రాల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు.

కల్తీ పెట్రోల్ విక్రయాలు..

నాంపల్లి: మోటారు వాహనాల చట్టం సవరణను నిరసిస్తూ.. పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యాజమానులు చేపట్టడంతో వాహనదారులు ఆందోళనలో పడ్డారు. పెట్రోల్‌బంకుల వద్ద ఎంట్రీక్లోజ్ అంటూ.. నోస్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద క్యూకట్టారు. పెట్రోల్ బంకుల వద్ద వాహనాల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ పోలీసులు చేతులెత్తేశారు. అదే సమయంలో పాఠశాలలు వదిలిపెట్టడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత జటిలమయ్యాయి. దళారులు బ్లాక్‌లో కల్తీపెట్రోల్‌ను విక్రయించారు. లీటర్ పెట్రోల్ రూ. 200 చొప్పున వినియోగదారులకు అమ్ముతున్నారు. చేసేదేమి లేక బ్లాక్‌లో విక్రయించిన కల్తీ పెట్రోల్‌ను కొనుగోలు చేయక తప్పలేదు.

రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి : రైల్లో నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి జారి పడి, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధి హఫీజ్‌పేట–హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్లున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి పరుగెడుతున్న రైల్లోంచి జారి కిందపడి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలి రంగు గీతల చొక్కా, నీలి రంగు ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులు లేదా 9000394635 సంప్రదించాలని పేర్కొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



జియాగూడ: పంచముఖి హనుమాన్ సేవా దళం ద్వారా ప్రతి ఏటా నూతన సంవత్సర కేలండర్‌ను విడుదల చేస్తామని సేవాదళం అధ్యక్షుడు శంకర్ అన్నారు. మంగళవారం జియాగూడ ఇమామ్‌పురాలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కట్ల అశోక్, సేవాదళం ప్రధాన కార్యదర్శి గుండ్రపల్లి మహేందర్, కోశాధికారి పవన్ ఇండోరియ, పురుషోత్తం, లక్ష్మీనారాయణ, దన్ను, వెంకటేష్, చంద్రకాంత్, నవీన్, ఆర్గనైజర్లు రాజేష్, అరుణ్‌కాంత్ ఉన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ : మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆదర్శనీయురాలని తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ సంఘం, తెలంగాణ చాంబర్స్ ఆఫ్ ఇండస్ట్రీల సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి బాలిక విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు పురస్కారాలను ప్రదానంచేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బెల్లం మాధవి, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

వాణిజ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి


కమిషనర్ శ్రీదేవితో రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ రహ్మత్‌అలీలు

అబిడ్స్: వాణిజ్య పన్నులశాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు రావుల ప్రదీప్‌కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మహ్మద్ రహ్మత్ అలీ పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త ప్రభుత్వం ద్వారా పరిష్కారం చేయిస్తామన్నారు. మంగళవారం వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ టీ.కే.శ్రీదేవికి వారు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సహా అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మధు, నాయకులు ప్రభాకర్, శ్రీరామ్, సందీప్, సాయిద్, నాగునాయక్‌లు పాల్గొన్నారు.

సన్మానం


అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

గోల్కొండ: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో స్వర్ణయుగ పాలన ప్రారంభమైందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పదేళ్ల నియంతపాలనను తెలంగాణ ప్రజలు అంతం చేశారని అభిప్రాయపడ్డారు'. ఎన్నికల సమయంలో పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను రికార్డు సమయంలో అమలు పరుస్తుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ, జావేద్ తదితరులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

నిందితుల రిమాండ్
31.34 కేజీల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్, ఇన్‌స్పెక్టర్లు

సంతోష్‌నగర్: అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు నిందితులను కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 31.34 కేజీల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్ కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబుతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం.. వట్టెపల్లి గుంతల్ బాబాదర్గా ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ ఫైసల్ (36), ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సమివుద్దీన్ (32), శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్ (28), శాస్త్రిపురానికి చెందిన హుస్నా ఫాతిమా అలియాస్ సాజిదా తబస్సుం (28)లు కలిసి గత కొద్ది రోజులుగా అక్రమంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని రవాణా చేస్తూ.. నగరంలో అవసరమైన వారికి అధిక డబ్బులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవాలని భావించారు. తన సంవత్సరం కావడంతో ఒడిషాకు చెందిన రితేష్ వద్ద 15 ప్యాకెట్ల (ఒక్క ప్యాకెట్ 2 కేజీలు) గంజాయిని రూ.56 వేలకు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన గంజాయిని బెలెనో కారు (టీఎస్08జీఎస్6166) డిక్కిలో అరకు ద్వారా హైదరాబాద్ నగరానికి తరలించి పిసల్‌బండ ఎక్స్‌రోడ్డు మార్గంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయమైన మేరకు సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కంచన్‌బాగ్ పోలీసులతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అరెస్ట్ చేసి విచారణ నిమిత్తం కంచన్‌బాగ్ పోలీసులకు అప్పగించగా.. వారు రిమాండ్‌కు తరలించారు. ఎస్సైలు లింగరాజు, పద్మయ్య, హిమారెడ్డి తదితరులున్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు బోధ లక్ష్మారెడ్డి

యాకుత్‌పురా: తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను సిటీ సివిల్‌కోర్టులోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆలిండియా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బోధ లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ. సుబ్బయ్య, రాష్ట్ర సంఘం నాయకులు, కార్యవర్గసభ్యులు తదితరులున్నారు.


గ్రేటర్‌లో కాంగ్రెస్‌ను పటిష్టం చేస్తాం

గోల్కొండ: గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్‌ను పటిష్టం చేస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధన సాధ్యమైందని, తెలంగాణ అంటే సోనియాగాంధీకి ఎంతో అభిమానమన్నారు. ఆమె చొరవతోనే స్వరాష్ట్రం సాకారమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆరు హామీల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రెండోదశలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన అనే అంశంపై కాంగ్రెస్ దృష్టి సాధిస్తుందన్నారు. చంటిబాబు, చంద్రశేఖర్, అబ్దుల్ అమీద్‌ఖాన్, రాంకుమార్, ప్రేమ్‌కిషోర్, సయ్యద్ నరహరి, సిరాజ్ తదితరులున్నారు.

పెట్రోల్‌బంకుల్లో పెరిగిన రద్దీ

అబిడ్స్ : పెట్రోల్‌బంకుల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవా రం ఉదయం నుంచే అబిడ్స్ పరిసర ప్రాంతాలు, గోషామహల్ ప్రాంతాల్లోని పెట్రోల్‌బంక్‌ల వద్ద పెట్రోల్, డిజిల్ కోసం వాహనదారులు విపరీతంగా రావడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన మోటర్ వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ.. ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ఆందోళనకు దిగడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా పెట్రోల్ కోసం వాహనదారులు బంకుల వద్ద క్యూ కట్టారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు మైక్ ద్వారా వాహనదారులకు అవగాహన కల్పించారు.

పారిశ్రామిక రంగాల అవసరాలకు ఐటీఐ సాంకేతిక నిపుణులు



విజయనగర్‌కాలనీ: పారిశ్రామిక రంగాల అవసరాల మేరకు నైపుణ్యవంతులైన సాంకేతిక నిపుణులను ఐటీఐల ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సంఘం కేలండర్‌ను మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు నైపుణ్యవంతులైన సాంకేతిక నిపుణులుగా మలిచి రాష్ట్రాభివృద్ధిలో వారి పాత్ర కీలకంగా మలిచేందుకు ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఐటీఐలను మరింత బలోపేతం చేయడంతో పారిశ్రామికరంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు సామ నరేందర్, మహ్మద్ జావేద్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పర్మనెంట్ చేయమంటే తొలగిస్తారా.. ?

ప్రైవేటు ఆసుపత్రి దిగువ స్థాయి సిబ్బంది నిరసన



చార్మినార్: ఎన్నో ఏళ్లుగా ఆసుపత్రిలో పని చేస్తున్న తమను కొత్తగా వచ్చిన కాంట్రాక్ట్ కంపెనీ యాజమాన్యం విధినిర్వాహణ నుంచి తొలగించకుండా తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ పురానీహవేలీలోని ప్రిన్సెస్ దుర్రుషెహవర్ చిల్డ్రన్స్ అండో జనరల్ ఆసుపత్రి కింది స్థాయి సిబ్బందైన హౌజ్ కీపింగ్ దాయాలు,వార్డు బాయ్స్ మంగళవారం ఉదయం నిరసన తెలిపారు. ప్రిన్సెస్ దుర్రుషెహవర్ చిల్డ్రన్స్ అండో జనరల్ ఆసుపత్రి ఐఎన్‌టీయుసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఫకీర్ షా వలి ఆధ్వర్యంలో సిబ్బంది ఆసుపత్రి ప్రధాన ద్వారం మెట్లపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందికి నచ్చ చెప్పారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఫకీర్ షా వలి మాట్లాడుతూ..సిబ్బందిని ఫర్మినెంట్ చేయాలని కోరితే..ఉన్న ఉద్యోగాలను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే పనుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చిరువ్యాపారులను వేధించొద్దు


ట్రాఫిక్ అధికారులతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తోపుడుబండ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులను అకారణంగా వేధించొద్దని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మితో కలిసి టోలిచౌకీ, సెవన్‌టూమ్స్ చౌరస్తా వద్ద పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి ఫుట్‌పాత్ వ్యాపారులు ఫుట్‌పాత్‌లనే కాకుండా రోడ్లను సైతం ఆక్రమిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దీన్ని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆమె చెప్పారు. తాము వారిని వేధించలేదని, రోడ్లపై వ్యాపారాలు చేస్తేనే వారిని హెచ్చరించామన్నారు. ప్రజా సమస్యలు తమకు తెలుసునని ఫుట్‌పాత్‌లపై స్థలం లేక పాదచారులు రోడ్లపై నడుస్తూ.. ప్రమాదాల బారినపడుతున్నారని ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకు వివరించారు. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఛలాన్లు, వారి వస్తువులను తీసుకుపోతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వారి సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. తోపుడు బండ్లు రోడ్లపై ఉండటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వాస్తవమేనని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆయన ట్రాఫిక్ పోలీసులను కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలని చిరువ్యాపారులకు చెప్పారు. రోడ్లపై తమ వ్యాపారాలకు సంబంధించిన వస్తువులను పెడితే సహించేది లేదని హెచ్చరించారు. టోలిచౌకీ, లంగర్‌హౌజ్, ఆసిఫ్‌నగర్, గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీ.హెచ్.సుధాకర్, అంజయ్య, బాలకృష్ణగౌడ్, మహేష్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684